# ఊరూరా సంక్రాంతి సంబురాలు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. సిద్దిపేటలో ముగ్గులు చిన్నపెద్ద తేడా లేకుండా డీజేలు పెట్టుకుని నృత్యాలు చేస్తూ, పతంగులను ఎగురవేశారు. కనుమ రోజు సిద్దిపేటలో రాగి చెట్టి హనుమాన్ దేవాలయంలో గోశాలలో గోమాతకు పూజలు చేశారు. మహిళలు గౌరమ్మకు ఇంట్లోనే నోములు చేసి మహిళలకు వాయినాలు ఇచ్చారు. అలాగే వారి వారి ఇండ్లల్లో విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట, జనవరి 15

సిద్దిపేట పట్టణంలోని 10వ వార్డులో పతంగులను చూపిస్తున్న చిన్నారులు, యువకులు

సిద్దిపేటలో కనుమ సందర్భంగా వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు

సిద్దిపేట రావిచెట్టు హనుమాన్ గోశాలలో గోమాతకు పూజ చేస్తున్న భక్తులు

## బండ మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తజనం

మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

- భక్తిశ్రద్ధలతో మల్లికార్జున స్వామిని దర్శించుకున్న భక్తులు
- వైభవంగా బోనాలు, బండ్లు ఊరేగింపు
- మల్లికార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), జనవరి 15: సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి–జంగపల్లి గ్రామాల శివారులోని బండ మల్లన్న గుట్ట పై మంగళవారం మల్లికార్జున స్వామి జాతర అంగరంగ వైభవంగా సాగింది. సంక్రాంతి పండుగ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట, చేగుంట మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వీరారెడ్డిపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్, దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి గ్రామాలకు చెందిన భక్తులు బోనాలు, బండ్లు, కాడెడ్లను అందంగా అలంకరించి గ్రామాల్లో డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. గుట్టపై ఇసుక వేస్తే రాలనంత భక్తజనం తరలివచ్చింది. జాతరలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వెంట మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, కంచం యాదగిరి, మాజీ ఎంపీటీసీ బాలమల్లేశం గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, పార్టీ జిల్లా నాయకుడు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఆలయ చైర్మన్ లింగాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండ మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తులు

## ముగిసిన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండాలపై నడుస్తున్న భక్తులు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 15: మండలంలోని పొట్లపల్లిలోని స్వయంభూ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలకు హుస్నాబాద్ మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఆలయంలో అభిషేకాలు, దిష్టి కుంభం, వీరభద్రస్వామి, భద్రకాళి పూజ నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎడ్లబండ్లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బుధవారం అగ్నిగుండాల్లో నడిచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

## మహాకాళేశ్వర సన్నిధిలో మహా రుద్రయాగం

ఉజ్జయినీలో వేద పారాయణం చేస్తున్న పండితులు

జగదేవపూర్, జనవరి 15: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయనీ నగరంలోని మహాకాళేశ్వర సన్నిధిలో జగదేవపూర్ గురుభవానంద భక్తసేవాసమితి ఆధ్వర్యంలో మూడు రోజులుగా మహారుద్ర యాగం వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ మదుసూదనశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడవ రోజు బుధవారం ప్రాతఃకాలం శ్రీమహాకాళేశ్వర స్వామికి మహాన్యాసం ఏకాదశ మహారుద్ర అభిషేకం, వేదస్వస్తి, నీరాజన సేవ నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో వేద పారాయణం, బ్రహ్మణులకు సన్మానం, అన్న సంతార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుశర్మ మాట్లాడుతు దేశ ప్రజలంతా సుభిక్షంగా, పచ్చని పాడిపంటలతో అందరూ క్షేమంగా ఉండాలనే సంకల్పంతో మహారుద్ర యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ యజుర్వేద పండితులు, శ్రీవైభవ జోశిగురువుగారు, మంచినీళ్ళ శ్రీరామశర్మ, సాయి చిన్మయి, కేశిరెడ్డి నర్సింహారెడ్డి దంపతులు, గొల్లపల్లి వాస్తవ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వేలేటి భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తిరువాభరణ శోభాయాత్ర

తిరువాభరణ శోభాయాత్రలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

హుస్నాబాద్‌టౌన్, జనవరి 15: హుస్నాబాద్‌లో మంగళవారం అయ్యప్పస్వామి తిరువాభరణ శోభాయాత్ర వైభవంగా సాగింది. స్థానిక భవాని సహితకాశీమరకత శివాలయంనుంచి స్వామి తిరువాభరణాలతో ఊరేగింపు ప్రారంభమై పురవీధుల గుండా సాగింది. అయ్యప్పస్వాముల నృత్యాలు, భజనలతో శోభాయాత్ర వైభోపేతంగా అయ్యప్ప స్వామి ఆలయం వరకు సాగింది. అనంతరం ఆలయంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మాజీఎంపీపీ ఆకుల వెంకట్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సుద్దాల చంద్రయ్య, కౌన్సిలర్లు వాల సుప్రజ, వల్లపు రాజు, చిత్తారి పద్మ, బూక్యా సరోజనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు కూలీలకు ఇందిరమ్మ భరోసా అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎగొండస్వామి

గజ్వేల్, జనవరి 15: రైతు కూలీలందరికి ఇందిరమ్మ భరోసా అమలు చేయాలని, గుంట భూమి ఉన్న రైతులను రైతు కూలీలుగా గుర్తించకపోవడం అన్యాయమని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి అన్నారు. అ సందర్భంగా బుధవారం మండల పట్టణ సమీపంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో రైతులతో కలిసి మట్లాడారు. తెలంగాణలో ఎకరంలోపు 24.57లక్షల మంది రైతులున్నరని, ఐదు గుంటలు, పది గుంటలు వారిని రైతులుగా పరిగణిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అనర్హులుగా పరిగణిస్తే దాదాపు 24లక్షల మంది కుటుంబాలకు అన్యాయం జరుగు తుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి అందరిని గుర్తించాలన్నారు. ఎకరంలోపు రైతులకు ఇందిరమ్మ భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో 20రోజుల పని నిబంధన ఉండడంతో చాలామంది నష్టపాయే ప్రమాదముందన్నారు. 60సంవత్సరాలు నిండినవారు ఉపాధి పనులకు వెళ్లవద్దనే నిబంధన ఉందని, అలాంటి వారికి అన్యాయం జరుగుతుందన్నారు. గ్రామ సభల ద్వారా అత్యంత పేదలకు ఇళ్ల కోసం ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో చిన్నమల్లన్న, నాగరాజు, రాజు, దేవయ్య పాల్గొన్నారు.

## కోలి సమాజాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

యాదగిరిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, జనవరి 15: జాతీయ స్థాయిలో అట్టడుగున నిలిచిన కోలి సమాజాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. అఖిల భారత కోలి సమాజ్ సభ్యుడిగా ఎన్నికైన పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కొట్టాల యాదగిరిని ఆయన నివాసంలో బుధవారం శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు లభించేలా శాయశక్తుల కృషి చేయాలని, ఎంతో నమ్మకంతో కట్టబెట్టిన పదవికి న్యాయం చేయాలన్నారు. కోలి సమాజానికి చెందిన ప్రతిఒక్కరూ ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎదిగేలా చూడాలన్నారు.

## క్రీడలు ఐక్యతను పెంచుతాయి

విజేతలకు మెమోంటో, నగదు అందజేస్తున్న తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, జనవరి 15: గ్రామాల్లోని విద్యార్థులు, యువకుల్లో ఐక్యమత్యాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండలంలోని ధర్మారంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రంగమైన యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలైన క్రీడాకారులకు బుధవారం తాను సొంతంగా నగదు ప్రైజ్ మని, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తోట కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమితో కుంగిపోకుండా రేపటి గెలుపు కొరకు సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, ధర్మారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షుడు తీపిరెడ్డి దుర్గారెడ్డి, నాయకులు యాదగిరి, మాలే రమేశ్, శేరిపల్లి నరేశ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన 'కొత్తకొండ' నృత్యాలు..

అక్కన్నపేట, జనవరి 15: మండలంలోని జనగామ లో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని గ్రామస్తులు హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు 50 ఎడ్లబండ్లలో మంగళవారం జాతరకు తరలివెళ్లారు. కొత్తకొండ నృత్యాలు ప్రజలను అలరించాయి. ఎడ్లబండ్ల ర్యాలీ పోటీలను తలపించే విధంగా తరలివెళ్లాయి. ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

## ముగ్గుల పోటీలు

మద్దూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామ పెద్దలు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 15: మద్దూరు మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిని అల్ల లావణ్య, ద్వితీయ బహుమతిని పిడిశెట్టి రాజేశ్వరి, తృతీయ బహుమతిని శ్రీరామ్ పావని గెలుచుకున్నారు. విజేతలకు గ్రామానికి చెందిన సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు, ఏసీపీ బోయిని గంగాధర్ పంపించిన బహుమతులను మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మాజీ ఎంపీటీసీ భూర్గు నర్సింహులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మనోహర్, జిల్లా కార్యదర్శి మల్లేశం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## సంబురంగా సంక్రాంతి వేడుకలు

గజ్వేల్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వంటేరు నరేందర్‌రెడ్డి

సిద్దిపేట, జనవరి 15: సంక్రాంతి వేడుకలు నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పండుగల తొలి రోజైన భోగినాడు భోగిమంటలతో పండుగ సంబురాలు ప్రారంభమయ్యాయి. ఆడపడుచులు తమ ఇండ్ల ముందు అందంగా, ఆకర్షణీయంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. చిన్న పెద్దాతేడా లేకుండా పతంగులు ఎగురవేశారు.

**దుబ్బాకలో...**

దుబ్బాక, జనవరి 16: దుబ్బాకలో సంక్రాంతి పండుగను ప్రజలంతా ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాలలో వేకువజామున వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో అలంకరించారు. పండుగ సందర్భంగా ప్రత్యేకమైన పిండి వంటలు చేశారు. చిన్నారులు, యువత పతంగులు ఎగురవేస్తూ ఆనందోత్సవాలలో తేలియాడారు. గ్రామాలలో గత మూడురోజులుగా బంధుమిత్రులతో సందడి నెలకొంది. బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కొమురవెల్లిలో..**

కొమురవెల్లి, జనవరి15: కొమురవెల్లి మండలంలో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. ఇండ్ల వద్ద రకరకాల పిండి వంటలు చేసుకొని ఉల్లాసంగా గడిపారు.

**విజేతలకు బహుమతుల ప్రదానం**

గజ్వేల్, జనవరి 15: సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. గజ్వేల్ సమీపంలోని ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డకిష్టాపూర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిద్దిపేట టౌన్: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై గోపాల్‌రెడ్డి

వర్గల్: రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై కరుణాకర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, జనవరి 15: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సిద్దిపేట వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు కొమురయ్య, రాజేశం సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక ముస్తాబాద్ చౌరస్తా, వేములవాడ కమాన్‌ల వద్ద వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి**

మితిమీరిన వేగం ప్రమాదకరమని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఎస్సై గోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం నాడాయన సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మోటారు వాహన చట్టం నిబంధనలపై ఆటోడ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

**వర్గల్‌లో..**

వర్గల్, జనవరి 15: ప్రతివ్యక్తి రోడ్డు నియమాలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం వర్గల్ మండలం సింగాయిపల్లిలో రోడ్డు భద్రతపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనం వేగంగా నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

**అక్బర్‌పేటలో...**

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), జనవరి 15: అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రజలకు, వాహనచోదకులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భూంపల్లి ప్రొబిషనరీ ఎస్సై ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**బెజ్జంకిలో...**

బెజ్జంకి, జనవరి 15: వాహనదారులు తప్పనసరిగా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని క్రాసింగ్‌లో రోడ్డు సేఫ్టీపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సరైన అవగాహన లేనందున ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

విజేత జట్టుకు నగదు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

చేర్యాల, జనవరి 15: చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని చేర్యాల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీలలో రమాఫణీంద్ర టీం విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.10వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు కోన నర్సింహులు, తాడెం వేణు, పచ్చిమడ్ల శ్రీను, పోలోజు విజయ్, పిల్లి ఆనంద్, కక్కర్ల నరేశ్, బూర్గు రాజు, కొట్టె కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలుకు సర్వే పక్కాగా నిర్వహించాలి

జగదేవ్‌పూర్: మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వినయ్‌కుమార్

రాయపోల్: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి బాబునాయక్

మద్దూరు: సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ రాధిక

జగదేవపూర్, జనవరి 15: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొత్త రేషన్ కార్డులకు లబ్దిదారుల ఎంపిక చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి వినయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీవో ఖాజమొహినొద్దీన్, ఏవో వసంతరావులతో కలసి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ, ఈజీఎస్ సిబ్బందికి సంక్షేమ పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్, రెవెన్యూ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

**మద్దూరులో...**

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 15: గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులు కృషి చేయాలని మండల స్పెషలాఫీసర్ రాధిక అన్నారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామ్మోహన్ అధ్యక్షతన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుపై గ్రామస్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ రహీం, ఏవో రామకృష్ణ, ఈసీ పరశురాములు, అధికారులు పాల్గొన్నారు.

**రాయపోల్‌లో...**

రాయపోల్, జనవరి 15: సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు మండల, గ్రామ స్థాయి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాయపోల్ మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ ఏడీఏ బాబునాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి సమీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలయ్య, తహసీల్దార్ దివ్య, ఎంపీవో శ్రీనివాస్, ఎంఏవో నరేష్, ఏపీవో రాములు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో...**

బెజ్జంకి, జనవరి 15: పథకాల అమలుపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ అన్నారు.బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో అంజయ్య, ఏవో సంతోష్, ఏఈ సమ్మయ్య, గ్రామ ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పటిష్టంగా సర్వే చేయాలి: ఆర్డీవో

మర్కూక్, జనవరి 15: ప్రభుత్వ పథకాల అమలుకు సర్వేను పటిష్టంగా నిర్వహించాలని ఆర్డీవో చంద్రకళ అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల, సర్వే నిర్వహణపై సిబ్బందికి అవగాహన నిర్వహించారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఆయా పథకాలకు సర్వేను పటిష్టంగా నిర్వహించాలన్నారు. 21 నుంచి 24 తేదీన ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ అరీఫా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులకే ఆహార భద్రతా కార్డులు

సిద్దిపేట, జనవరి 15: నూతన రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలు, సర్వే ఆధారంగా ఆన్‌లైన్ డేటా ప్రకారం రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తెలిపారు. బుధవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బంది, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. రైతు భరోసా కొత్తహార భద్రతా కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రీ వెరిఫికేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముసాయిదా జాబితాను వార్డు సభలో ప్రదర్శించి వార్డు సభల ద్వారా అర్హులకు ఆహార భద్రత కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## యువత దేశసేవ చేయాలి

మిరుదొడ్డి, జనవరి 15: పల్లెల్లోని యువతీ, యువకులు ఉన్నత చదువులు చదివి దేశ సేవ చేయాలని మిరుదొడ్డి ఎస్సై పర్శరాములు అన్నారు. ఆర్మీ డేను పురస్కరించుకొని బుధవారం మిరుదొడ్డి టౌన్‌లో నైపుణ్య యూత్ ఆధ్వర్యంలో యువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీలో చేసి దేశ సేవ చేయడానికి యువకులు కంకణబద్దులు కావాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో నైపుణ్య యూత్ జిల్లా అధ్యక్షుడు మొగుళ్ల ఐలయ్య, యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్వేకు సహకరించాలి

గజ్వేల్, జనవరి 15: ప్రజాపాలనలోని నూతన రేషన్‌కార్డుల కోసం నేటి నుండి మున్సిపాలిటీలోని వార్డుల్లో చేపట్టే సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ గోల్కొండ నర్సయ్య కోరారు. బుధవారం కార్యాలయంలో సర్వేలో పాల్గొనే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. సర్వే ద్వారా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మీయ భరోసాను విడుదల చేయాలి

మిరుదొడ్డి, జనవరి 15: రాష్ట్రంలో వ్యవసాయ భూములు లేని కూలీల కుటుంబాలకు ఒకే విడతలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం నాడాయన మిరుదొడ్డిలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాది గడుస్తున్నా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఒక ఎకరంలోపు భూమి ఉన్న ప్రతి పేద కుటుంబానికి రూ.12వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి ఎన్నికల హామీకి కట్టుబడి ఉండాలన్నారు. దళితులకు రూ..12 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు.

## పేదింటి వధువుకు ఆర్థికసాయం

చేర్యాల, జనవరి 15: చేర్యాల పట్టణంలోని నాల్గో వార్డులో నివసిస్తున్న ఎండీ సయ్యద్ కూతురు వివాహానికి యువజన నాయకుడు అంబాల రాముగౌడ్ రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో దాసరి శ్రీకాంత్, ఎండీ ఖాజా, పరంకుశం వెంకటేశ్ పాల్గొన్నారు.